సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
7
సోమవారం । 16 । డిసెంబర్ । 2024



చాపరాయికి భారీ ఆదాయం

ప్రముఖ పర్యాటక ప్రాంతం చాపరాయి జలవిహారికి రోజురోజుకు సందర్శకుల తాకిడి పెరుగుతోంది. సెప్టెంబర్‌లో రూ.3,67,390, అక్టోబర్‌లో రూ. 18,84,270, నవంబర్‌లో రూ.14,00,210తో మొత్తం మూడు నెలల్లో రూ.36,51,870 ఆదాయం సమకూరిందని చాపరాయి జలవిహారి నిర్వాహకులు తెలిపారు. -డుంబ్రిగుడ

న్యూస్‌రీల్

పోలవరం నిర్వాసితుల సమస్యలు గుర్తించండి



కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

- కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం

పాడేరు : పోలవరం నిర్వాసితుల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయం నుంచి చింతూరు, రంపచోడవరం డివిజన్ పరిధిలోని అధికారులతో పోలవరం నిర్వాసితుల సమస్యలు, సదుపాయాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టులో భాగంగా భూములు, ఇళ్లు కోల్పోయిన వారి వివరాలపై రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సంయుక్తంగా సమగ్రమైన సర్వే నిర్వహించాలని ఆదేశించారు. భూములు కోల్పోయిన రైతులకు ప్రత్యామ్నాయ భూముల కేటాయింపుపై ఫిర్యాదుల వివరాలను ఆయన తెలుసుకున్నారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి నిర్వాసితుల సమస్యలపై ఒకరోజు సమీక్ష నిర్వహిస్తామన్నారు. బాధితుల వివరాలు, సమస్యలపై సమగ్రమైన నివేదికలు తయారు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్, చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్, రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పనశ్రీ, పోలవరం ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్ సరళ వందనం, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అంబేడ్కర్ పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో మధుచందన ప్రతిభ

- సిల్వర్ పతకం సాధన



పతకం అందుకున్న మధుచందన

చింతూరు: జాతీయస్థాయి 68వ స్కూల్ గేమ్స్ వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో స్థానిక కేజీబీవీ విద్యార్థిని గుత్తుల మధుచందన సిల్వర్ పతకం సాధించింది. ఈనెల 9 నుంచి 15 వరకు జరిగిన ఈ పోటీల్లో ప్లస్ 87 కేజీల విభాగంలో మధుచందన ఈ పతకం సాధించింది. ఆమెను కోచ్ గోలి గంగాధర్, స్థానికులు అభినందించారు.

రోడ్డు విస్తరణ గుబులు

- ముంచంగిపుట్టులో ఇరువైపులా 50 అడుగుల చొప్పున నాలుగు రోడ్ల విస్తరణ
- కొలతలు తీసి మార్కింగ్ వేసిన రెవెన్యూ అధికారులు
- ఆందోళనలో దుకాణ, గృహ యజమానులు
- త్వరలో నోటీసులు జారీకి రంగం సిద్ధం చేస్తున్న అధికారులు



ముంచంగిపుట్టులో విస్తరణకు నోచుకోనున్న ప్రధాన మార్గం



రోడ్డు విస్తరణలో భాగంగా కొలతలు తీస్తున్న రెవెన్యూ అధికారులు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో రోడ్డు విస్తరణ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. దీంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణ, గృహ యజమానులు, వ్యాపారుల్లో గుబులు నెలకొంది. రోడ్డు విస్తరణ జరిగితే ఎన్నో ఏళ్ల నుంచి నివాసం ఉంటున్న దుకాణాలు, ఇళ్లు తొలగిపోతాయని ఆందోళన చెందుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే మండల కేంద్రంలో నాలుగు రోడ్లను విస్తరణ చేయాలని గతం నుంచి డిమాండ్ ఉంది. దీనిలో భాగంగా కొద్ది రోజుల క్రితం జిల్లా అధికారుల ఆదేశాల మేరకు స్థానిక రెవెన్యూ అధికారులు ముంచంగిపుట్టు నుంచి బాపనపుట్టు, పెద్దపుట్టు, కించాయిపుట్టు, సుజనకోట మార్గాల్లో రెండు కిలో మీటర్ల మేర ఆర్‌అండ్‌బీ, పీఆర్ రోడ్డు ప్రాంతాల్లో సర్వే చేశారు. కొలతలు నమోదు చేశారు.

కొలతలు తీసి మార్కింగ్..

ప్రధాన రహదారికి ఇరువైపులా 50 అడుగుల చొప్పున కొలతలు తీసి, మార్కింగ్ వేశారు. దీంతో మండల కేంద్రంలో చాలా దుకాణాలు, ఇళ్లు తొలగించే పరిస్థితి ఉందని పలువురు చెబుతున్నారు. గత 20 నుంచి 40 ఏళ్లకు పైగా దుకాణాలు, ఇళ్లు నిర్మించుకొని జీవనం సాగిస్తున్న తమకు రోడ్డు విస్తరణతో జీవన ఆధారంగా ఉండే దుకాణాలు ,ఇళ్లు తొలగిస్తే రోడ్డున పడతామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

త్వరలో నోటీసులు

మండల కేంద్రంలో రోడ్డుకు ఇరువైపులా ఆర్అండ్‌బీ, పీఆర్ స్థలాలను ఆక్రమించి, దుకాణాలు, గృహాలు నిర్మించి, గత 30 ఏళ్లగా జీవిస్తున్న వారందరికీ త్వరలో రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేయనున్నారు. మండల కేంద్రం నుంచి నాలుగు రోడ్ల వైపు రెండు కిలోమీటర్ల మేర ప్రభుత్వ భూమిని 187 మంది 2ఎకరాల 83 సెంట్లు ఆక్రమించినట్టు గుర్తించారు. వీటిని వెంటనే ఖాళీ చేయాలని రెవెన్యూ అధికారులు నోటీసులు సిద్ధం చేస్తున్నారు. వారం రోజుల్లో ఇవి ఆర్‌అండ్‌బీ, పీఆర్ రోడ్లుకు ఇరువైపులా ఆక్రమణ చేసిన వారందరికీ అందనున్నాయి. దశల వారీగా నోటీసులు అందజేసి, వారీ ఖాళీ చేయని పక్షంలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో వాటిని తొలగించనున్నారు. మండల కేంద్రంలో ప్రస్తుతం రోడ్డు విస్తరణ వల్ల తీవ్రంగా నష్ట పోతామని, 50 అడుగులు కన్నా తగ్గిస్తే మంచిదని స్థానికులు అభిప్రాయాలు సేకరించి తదనుగుణంగా రోడ్డు విస్తరణ చేయాలని దుకాణదారులు, గృహ యజమానులు కోరుతున్నారు. జిల్లా స్థాయి అధికారులు, ప్రభుత్వం ఆ దిశగా ఆలోచన చేయాలని వారంతా మొరపెట్టుకుంటున్నారు.

> మారుమూల ప్రాంతాలకు చెందిన వారంతా పేద కుటుంబాలు. ఉన్న కొద్దిపాటి భూములను అమ్ముకుని మండల కేంద్రం ముంచంగిపుట్టులో దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. నివాసం ఉండేందుకు ఇళ్లు కూడా నిర్మించుకుని సాఫీగా జీవనం సాగిస్తున్నారు. ఇంతలో రోడ్ల విస్తరణకు సంబంధించి రెవెన్యూ అధికారులు సర్వే చేసి హద్దులు ఏర్పాటుచేశారు. ఇళ్లు, దుకాణాలను ఖాళీ చేయాలని 187 మందికి నోటీసులు జారీకి రంగం సిద్ధం చేస్తుండటంతో ఆ పేద కుటుంబాలు ఒక్కసారిగా ఆందోళనకు గురవుతున్నాయి. తాము రోడ్డున పడకుండా చూడాలని విన్నవించుకుంటున్నాయి.

స్థలాలు ఖాళీ చేయాలని నోటీసులిస్తాం

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల కేంద్రంలో రోడ్డుకు ఇరువైపులా ఆర్అండ్‌బీ, పీఆర్‌లకు సంబంధించిన స్థలం ఎంత ఉంది అనేదానిపై సర్వే చేసి ఆక్రమణలను గుర్తించాం. రోడ్డుకు ఇరువైపులా 50 అడుగుల మేర రోడ్డు విస్తరణ జరుగుతుంది. ప్రభుత్వ భూమిని ఆక్రమించి, దుకాణాలు, ఇళ్లు నిర్మించుకున్న వారిని గుర్తించాం. ఆక్రమణ చేసిన స్థలాలను ఖాళీ చేయాలని, త్వరలోనే నోటీసులు అందిస్తాం.

– నర్సమ్మ, తహసీల్దార్, ముంచంగిపుట్టు

పునరాలోచించాలని వినతి

ఇంత భారీ ఎత్తున రోడ్డు వెడల్పు చేయడం సరికాదని, అంత అవసరం కూడా ప్రస్తుత పరిస్థితిలో లేదని దుకాణదారులు, వ్యాపారులు వాపోతున్నారు. దీంతో స్థానికులు రోడ్డు విస్తరణ వెసులుబాటు కల్పించాలని, ఇంతస్థాయిలో విస్తరణ వల్ల మండల కేంద్రంలో చాలామంది బతుకులు రోడ్డున పడతాయని వారు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. గ్రామాల్లో భూములు అమ్ముకొని, మండల కేంద్రంలో దుకాణాలను నిర్మించి, జీవనాధారంగా చేసుకొని బతుకుతున్నామని జిల్లా స్థాయి అధికారులు, విస్తరణ విషయంలో ప్రభుత్వం పునరాలోచన చేయాలని మండలంలోని దుకాణదారులు, గృహ యజమానులు కోరుతూ ఇటీవల తహసీల్దార్ నర్సమ్మకు వినతి పత్రం అందజేశారు.



ఇటీవల తహసీల్దార్ నర్సమ్మకు వినతి పత్రం అందిస్తున్న దుకాణదారులు, ఇళ్ల యజమానులు

గురుకుల విద్యార్థి అదృశ్యం

- పోలీసులకు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఫిర్యాదు



విద్యార్థి మనోజ్‌తేజ్

కొయ్యూరు: స్థానిక గురుకుల పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి మనోజ్ తేజ్ (బాబులు) అదృశ్యమైనట్టు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శనివారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే వచ్చేస్తానని ఈ నెల 13 సాయంత్రం పాఠశాలలో తోటి స్నేహితులకు చెప్పి బయటకు వెళ్లిన మనోజ్‌తేజ్ ఎంతకీ రాకపోవడంతో పాత పాడేరులో ఉంటున్న విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చినట్టు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మోహన్ తెలిపారు. అక్కడికి కూడా రాలేదని వారు చెప్పడంతో అన్నిచోట్ల వెతికినా ఎటువంటి వివరాలు లభ్యం కాలేదన్నారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశామని ఆయన వివరించారు. మనోజ్ తేజ్ గతంలో కొన్ని సార్లు చెప్పకుండా బయటకు వెళ్లి, తరువాత వచ్చేవాడని తోటి విద్యార్థులు చెబుతున్నారు.

పూర్తిస్థాయిలో ఉపాధ్యాయుల్లేక..

గురుకుల పాఠశాలల్లో అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు నెలరోజులుగా ఆందోళన బాట పట్టడంతో విద్యార్థుల చదువులు అటకెక్కాయి. కొయ్యూరు గురుకుల పాఠశాలలో ముగ్గురు మాత్రమే రెగ్యులర్ ఉపాధ్యాయులు ఉన్నారు. వీరు 500 మంది పిల్లలను పర్యవేక్షణ చేయడం చాలా కష్టతరంగా ఉంది. ఈ పరిస్థితుల్లో బయటకు వెళ్లిన వంతల మనోజ్ తేజ్ పాఠశాలకు తిరిగి రాలేదు.

కూటమితో మాకు సంబంధం లేదు

- కించవానిపాలెం నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షురాలు కన్నయ్యమ్మ

కొయ్యూరు: మంప పంచాయతీ కించవానిపాలెం నీటి వినియోగదారుల సంఘ ఎన్నికల్లో విజయం సాధించిన తమకు కూటమికి ఎటువంటి సంబంధం లేదని సంఘ అధ్యక్షురాలు నత్తూరి కన్నయ్యమ్మ ఆదివారం తెలిపారు. ఈ ఎన్నికల్లో కూటమి మద్దతుదారు గెలిచినట్టుగా చేస్తున్న ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదని నీటి సంఘం ఉపాధ్యక్షులు పప్పుల సోములు,సభ్యులు పొట్టయ్య, సన్యాసిరావు, గోకిరి సీతమ్మ పేర్కొన్నారు. ఎంపీపీ బడుగు రమేష్ స్వగ్రామం కావడంతో ఆయన మద్దతుదారులుగా గెలిపొందామని వారు పేర్కొన్నారు. ఎన్నికల వద్దకు కూటమి నేతలు ఎవ్వరూ రాలేదని వారు వివరించారు.

జి.మాడుగులలో @ 5.7

- నమోదైన కనిష్ట ఉష్ణోగ్రతలు



లంబసింగి ప్రాంతంలో మంటను కాగుతున్న పర్యాటకులు



తాజంగిలో దట్టంగా కురుస్తున్న పొగమంచు

చింతపల్లి: మన్యంలో ఉష్ణోగ్రతలు రోజురోజుకు తగ్గిపోతున్నాయి. చలితీవ్రత మరింత పెరిగింది. ఆదివారం జి.మాడుగులలో 5.7 డిగ్రీలు, డుంబ్రిగుడలో 7.9 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అయినట్లు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. పాడేరు డివిజన్ పరిధిలోని అరకులోయలలో 8.8 డిగ్రీలు, అనంతగిరిలో 9.1, హుకుంపేటలో 9.3, పెదబయలులో 9.7, ముంచంగిపుట్టు, పాడేరులో 10.2, చింతపల్లిలో 10.7, కొయ్యూరులో 12.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అయినట్టు ఆయన వివరించారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

- పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు
- త్వరలో 'మన ఎమ్మెల్యే మాఊరు' కార్యక్రమం
- ప్రతి గ్రామం సందర్శించి కూటమి మోసాలు వివరించేలా కార్యాచరణ
- వైఎస్సార్‌సీపీ శ్రేణుల సమక్షంలో పోస్టర్ల ఆవిష్కరణ

పాడేరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఆరు నెలల కాలంలో చేసిన మోసాలను ప్రజలకు వివరించడమే కాకుండా గిరిజన గ్రామాల్లో సమస్యల గుర్తించి పరిష్కారమే ధ్యేయంగా నియోజకవర్గంలో మన ఎమ్మెల్యే మా ఊరు కార్యక్రమం చేపడుతున్నట్లు స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు వెల్లడించారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆరు నెలల కాలంలో గిరిజనులకు ఒరిగింది లేదన్నారు. మోసపూరితమైన హామీలతో అధికారంలోకి వచ్చిన తరువాత వీటిలో ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని అమలు చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వానికి ఆరు నెలల సమయం ఇచ్చినా మార్పు లేదన్నారు. పాలనలో పూర్తిగా విఫలమైందన్నారు. కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలకు వివరిస్తామన్నారు. మన ఎమ్మెల్యే మా ఊరు కార్యక్రమంలో అధికారులతో కలిసి గ్రామాలను సందర్శించి వారి సమస్యలు తెలుసుకొని అక్కడికక్కడే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రధాన సమస్యలను సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి ప్రయత్నిస్తామని పేర్కొన్నారు. లేని పక్షంలో స్థానిక గిరిజనులతో కలిసి సమస్య పరిష్కారం కోసం శాంతియుత ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు. త్వరలో షెడ్యూల్ విడుదల చేసి కార్యక్రమాలను చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు కూడా సురేష్‌కుమార్, కిల్లు కోటిబాబు నాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా జిల్లా అధ్యక్షుడు తెడబారికి సురేష్ కుమార్, మాజీ సర్పంచ్‌లు శరభ సూర్యనారాయణ, మినుముల కన్నాపాత్రుడు, పాంగి నాగరాజు, వంతాల నరేష్ పేర్కొన్నారు.



'మన ఎమ్మెల్యే మా ఊరు' పోస్టర్ ఆవిష్కరిస్తున్న పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

మహనీయుడు పొట్టి శ్రీరాములు

- జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ
- చిత్రపటానికి పూలమాల వేసి నివాళి



పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మత్స్యలింగం



కలెక్టరేట్‌లో పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న జేసీ అభిషేక్ గౌడ




క్యాంప్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

పాడేరు : ఆంధ్ర రాష్ట్రం కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని జాయింట్ కలెక్టర్ అభిషేక్‌గౌడ అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లో పొట్టి శ్రీరాములు వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సాధన కోసం 53 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి ప్రాణాలు అర్పించారన్నారు. ఆయన త్యాగఫలితంగా రాష్ట్రాన్ని సాధించారన్నారు. ఆయన త్యాగఫలం కారణంగా భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడ్డాయన్నారు. ఐటీడీఏలో ఏవో హేమలత నివాళులు అర్పించారు. తహసీల్దార్ వంజంగి త్రినాథనాయుడు, పరిపాలన అధికారి నాగరాజు పాల్గొన్నారు.

రంపచోడవరం: స్థానిక ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పీవో కట్టా సింహాచలం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఈఈ ఐ. శ్రీనివాసరావు, పీహెచ్‌వో చిట్టిబాబు, డీఈఈలు చైతన్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. మండల పరిషత్‌లో పొట్టి శ్రీరాములు, సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతిని ఎంపీపీ బందం శ్రీదేవి అధ్యక్షతన నిర్వహించారు. జెడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి తదితరులు నివాళులర్పించారు.

పాడేరు : రాష్ట్ర సాధనకోసం ప్రాణాలను ఫణంగా పెట్టిన మహానుభావుడు పొట్టి శ్రీరాములు అని పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు అన్నారు. క్యాంప్ కార్యాలయంలో ఆయన వర్ధంతి నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తెలుగు ప్రజల కోసం ఆయన ఆత్మార్పణ నేటికీ చిరస్థాయిగా నిలుస్తోందన్నారు. ఆయన త్యాగాలను ప్రతి ఒక్కరు గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు కూడా సురేష్‌కుమార్, కిల్లు కోటిబాబు నాయుడు, మాజీ సర్పంచ్‌లు శరభ సూర్యనారాయణ, మినుముల కన్నాపాత్రుడు, పాంగి నాగరాజు పాల్గొన్నారు.

అరకులోయ టౌన్: అమరజీవి పొట్టి శ్రీరాములు అని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. ఆయన వర్ధంతి పురస్కరించుకుని ఆదివారం తన క్యాంప్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పాంగి చిన్నారావు, సంయుక్త కార్యదర్శి జన్ని నరశింహమూర్తి, పార్లమెంట్ నాయకుడు కమిడి అశోక్, ఎంపీటీసీలు దురియా ఆనంద్ కుమార్, సమర్థి శత్రుఘ్న తదితరులు పాల్గొన్నారు.



రంపచోడవరం ఐటీడీఏలో నివాళులర్పిస్తున్న పీవో కట్టా సింహాచలం

ఆ మూడు సంఘాలకు నామినేషన్లు నిల్

అడ్డతీగల: మండలంలోని మూడు సాగునీటి సంఘాలకు శనివారం ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదని చిన్నతరహా నీటిపారుదలశాఖ ఏఈ హరి ఆదివారం తెలిపారు. గొంటువానిపాలెంలోని ఊరచెరువు, దొంతులవారి చెరువు సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించేందు శనివారం వెళ్లామన్నారు. వీటికి ఎవ్వరూ నామినేషన్లు వేయలేదన్నారు. అలాగే తుంగమడుగులలోని ముసిరిమాను చెరువు సాగునీటి సంఘం ఎన్నికలకు కూడా నామినేషన్లు దాఖలు కాలేదని ఆయన పేర్కొన్నారు. ఈ కారణంగా మూడు సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహణ జరగలేదన్నారు. వాటికి ఎన్నికల నిర్వహణపై ఉన్నతాధికారుల సూచనల మేరకు తదుపరి చర్యలు చేపడతామని ఆయన వివరించారు.



మాడగడ వ్యూపాయింట్ వద్ద సూర్యోదయం అందాలను తిలకిస్తున్న పర్యాటకులు

పోటెత్తిన పర్యాటకులు



పెదబయలులో కనువిందు చేస్తున్న భానుడి అందాలు

చింతపల్లి/డుంబ్రిగుడ/హుకుంపేట/అరకులోయ టౌన్/ అనంతగిరి (అరకులోయ టౌన్)/హుకుంపేట/: మైదాన ప్రాంతాల నుంచి భారీగా సందర్శకులు ఆదివారం భారీగా తరలి రావడంతో పర్యాటక ప్రాంతాలు కిటకిటలాడాయి. లంబసింగి సమీపంలోని చెరువులవేనం వ్యూపాయింట్‌కు పోటెత్తారు. చాపరాయి జలవిహారి సందడిగా మారింది. జలపాతంలో స్నానాలు చేస్తూ సందడి చేశారు. అంజోడలోని అరకు పైనరీ పర్యాటకులతో కిటకిటలాడింది. జైపూర్ జంక్షన్ నుంచి పాడేరు మార్గంలో కించుమండ వరకు ఉన్న పూల తోటల్లో ఫొటోలు, సెల్ఫీలు తీసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. సీతమ్మ పర్వతంపై ప్రకృతి అందాలు తిలకించేందుకు భారీగా తరలివచ్చారు. సూర్యోదయం అందాలతోపాటు ధింసా రాళ్లు, తేనెపట్టు గుహలను సందర్శించారు. ప్రముఖ పర్యాటక కేంద్రం అరకులోయకు కిటకిటలాడింది. తెల్లవారకముందే ప్రత్యేక వాహనాల్లో మాడగడ సన్‌రైజ్ వ్యూ పాయింట్‌కు తరలివెళ్లారు. పద్మాపురం ఉద్యానవనం, గిరిజన మ్యూజియంలో సందడి నెలకొంది. బొర్రా గుహలకు సందర్శకులు పోటెత్తారు. విశాఖ-కిరండోల్ రైలులో తరలివచ్చారు. ఉదయం పదిన్నర సమయంలో బొర్రా గుహలు సందర్శలతో కళకళలాడింది. కార్లు, జీపుల్లో కూడా రావడంతో బొర్రా జంక్షన్ నుంచి బొర్రా గుహల వరకు ట్రాఫిక్ సమస్య నెలకొంది. పెదబయలు ప్రాంతంలోని మత్స్యగెడ్డ వద్ద భానుడి అందాలు కనువిందు చేశాయి. ప్రకృతి ప్రేమికులు ఆసక్తిగా తిలకించారు.



బొర్రా గుహలు వద్ద భారీ పర్యాటకులు



అరకు పైనరీలో ఉడ్ కాటేజీల వద్ద పర్యాటకులు



చెరువులవేనం వ్యూపాయింట్‌కు భారీగా తరలివచ్చిన పర్యాటకులు



చాపరాయి జలవిహారి ముఖద్వారం వద్ద పర్యాటకుల సందడి

కాలుష్యంతో జలచరాలు మృత్యువాత


పూడిమడక తీరంలో తాబేళ్ల కళేబరం

అచ్యుతాపురం: కాలుష్యంతో మత్స్య సంపదకు భారీ నష్టం వాటిల్లుతోంది. తాబేళ్లు, ఇతర జలచరాల కళేబరాలు నిత్యం పూడిమడక తీరానికి కొట్టుకువస్తున్నాయని ఆ గ్రామానికి చెందిన మత్స్యకారుడు వాసుపల్లి శ్రీనివాసరావు, గ్రామస్తులు తెలిపారు. అరుదైన తాబేళ్లు మరణిస్తున్నాయని, వాటిని కాపాడాలని ఆయనతోపాటు పలువురు కోరారు.

అడవుల రక్షణ అందరి బాధ్యత


ఫారెస్ట్ రేంజర్ రవివర్మ

చోడవరం రూరల్: అడవుల్లో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే తక్షణం టోల్‌ఫ్రీ నంబర్లకు సమాచారం అందించాలని అటవీశాఖ చోడవరం రేంజ్ అధికారి రవివర్మ కోరారు. ఆదివారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. అడవుల రక్షణ అందరి బాధ్యత అని చెప్పారు. నిత్యం అడవుల్లోకి అటవీ సంపద కోసం వెళ్లే వారు, వివిధ ప్రాంతాల సందర్శనకు వచ్చే వారు సిగరెట్ వంటివాటిని కాల్చి నిర్లక్ష్యంగా పారేస్తుండడంతో అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. ప్రమాదాల నివారణకు అందరూ తక్షణం స్పందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. అటవీశాఖ టోల్‌ఫ్రీ నంబర్ 1800 425 5909, చోడవరం రేంజ్ ఆఫీసర్ ఫోన్ నంబర్ 94441459400, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ 9491872256, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఫోన్‌నంబర్ 9493434910కు సమాచారం అందించి అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణకు సహకరించాలని ఆయన కోరారు.

డీఈఐలో మూడు నెలల కోర్సులు

- దరఖాస్తుకు ఈ నెల 31 ఆఖరు

ఆరిలోవ: విశాలాక్షినగర్‌లోని దయాల్‌బాగ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఇన్ఫర్మేషన్ సెంటర్‌లో మూడు నెలల కోర్సులు ప్రారంభిస్తున్నట్లు సెంటర్ ఇన్‌చార్జి దక్షిణమూర్తి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 8వ తరగతి ఉత్తీర్ణులైన వారి కోసం టై అండ్ డై కోర్సు, 10వ తరగతి ఉత్తీర్ణులైన వారి కోసం మొబైల్ ఫోన్ రిపేరింగ్, మెయింటెనెన్స్ కోర్సు, డ్రెస్ డిజైనింగ్ అండ్ టైలరింగ్, టెక్స్‌టైల్ డిజైనింగ్ అండ్ ప్రింటింగ్ కోర్సులు, ఇంటర్ పూర్తి చేసిన వారి కోసం కంప్యూటర్ ఆపరేటింగ్ అండ్ ఆఫీస్ అసిస్టెంట్ కోర్సుల్లో శిక్షణ ఇస్తామన్నారు. ఆయా కోర్సుల్లో చేరేందుకు వయసుతో సంబంధం లేకుండా స్త్రీ, పురుషులెవరైనా అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ఈ నెల 31వ తేదీ లోగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 99633 40611 సంప్రదించవచ్చు.

ధనుర్మాసోత్సవాలకు వేళాయె..

- నేడు ఉదయం 6.57 గంటలకు నెల గంట ప్రారంభం
- జనవరి 10న ముక్కోటి ఏకాదశి
- 13న గోదా రంగనాథుల కల్యాణం


ఉపమాక వేంకటేశ్వర స్వామి వారి ఆలయం

నక్కపల్లి: ధనుర్మాసోత్సవాలకు వేళయింది. ఉపమాక వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం నుంచి ధనుర్మాసోత్సవాలు ఘనంగా ప్రారంభం కానున్నాయి. దీనిలో భాగంగా గరుడాద్రిపై వెలసిన మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకం అనంతరం ధనుర్లగ్న ప్రవేశమునుసరించి ఉదయం 6.57 గంటలకు ఘంటానాథం(నెలగంట) జరుగుతుంది. సోమవారం నుంచి వచ్చే నెల 14వ తేదీ వరకు శ్రీదేవీ, భూదేవీ సమేత కల్కి వేంకటేశ్వర స్వామివారికి, గోదాదేవి అమ్మవారి ఉత్సవమూర్తులకు ప్రతి రోజు రెండు వాహనాల్లో ఒకే సమయంలో గ్రామ తిరువీధి సేవలు టీటీడీ ఆధ్వర్యంలో జరగనున్నాయని ఆలయ ప్రధానార్చకుడు గొట్టుముక్కల వరప్రసాదాచార్యులు తెలిపారు.

వచ్చే నెల 10న ఉత్తర ద్వార దర్శనం

ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా జనవరి 10వ తేదీ శుక్రవారం ముక్కోటి ఏకాదశిని(వైకుంఠ ఏకాదశి) పురస్కరించుకుని స్వామివారి ఉత్సవమూర్తులకు రంగనాథుని అలంకరణ చేసి భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించనున్నారు. భద్రచలం, శ్రీశైలం, అన్నవరం, సింహాచలం తదితర పుణ్యక్షేత్రాల్లో ముక్కోటి ఏకాదశి నాడు మాత్రమే ఉత్తర ద్వార దర్శనం ఉంటుంది. ఉపమాకలో మాత్రం గరుడాద్రిపై షడ్భుజాలతో అశ్వంపై కూర్చొని కల్కి అవతారంలో ఉన్న స్వామివారి మూల విరాట్‌ను నిత్యం ఉత్తర ద్వారం ద్వారానే దర్శనం కలుగుతుంది.

13న గోదా కల్యాణం

వచ్చే ఏడాది జనవరి 13న భోగి పండగను పురస్కరించుకుని గోదారంగనాథుల కల్యాణం ఉపమాకలో ఘనంగా నిర్వహించనున్నారు. ఉదయం 11 గంటలకు స్వామివారి పుష్పతోటలో ఈ కల్యాణాన్ని జరగనుంది. 14వ తేదీ మంగళవారం ఉత్తరాయణ పుణ్యకాలం ప్రవేశంలో స్వామివారి తిరువీధి సేవలు నిర్వహించనున్నారు.

జనవరి 15న స్వామివారి గిరిప్రదక్షిణ

జనవరి 15వ తేదీ కనుమ పండగను పురస్కరించుకుని స్వామివారి ఉత్సవ మూర్తులను రాజాధిరాజ వాహనంలో అధిష్ఠింపజేసి సాయంత్రం 5 గంటలకు భక్తుల గోవింద నామస్మరణల మధ్య గరుడాద్రి చుట్టూ గిరిప్రదక్షిణ ఉత్సవం నిర్వహించనున్నారు. అనంతరం లంకవారి మండపం వద్ద కరి మకర సంవాదోత్సవం జరపనున్నారు. ధనుర్మాసోత్సవాలకు సంబంధించి టీటీడీ అన్ని ఏర్పాట్లు చేసిందని ప్రధానార్చకుడు తెలిపారు.

వైష్ణవాలయాలు ముస్తాబు

యలమంచిలి రూరల్: యలమంచిలి పట్టణం, మండలంలోని వైష్ణవాలయాలు సోమవారం నుంచి జరిగే ధనుర్మాసోత్సవాలకు ముస్తాబయ్యాయి. పట్టణంలోని వీరాద్రి వేంకటేశ్వరస్వామి ఆలయం, ధర్మవరం ఉమావేంకటేశ్వర స్వామి ఆలయం, పురాతన వేణుగోపాల స్వామి ఆలయంతో పాటు బస్టాండు సమీపంలో కొమ్మాయి గుండం చెరువుగట్టున ఆంజనేయస్వామి ఆలయం పక్కనున్న వేంకటేశ్వరస్వామి ఆలయాలు ధనుర్మాస ఉత్సవాలకు సిద్ధమయ్యాయి. మండలంలోని మైహోం ఇండస్ట్రీస్ సిమెంట్ కర్మాగారంలో కొలువుదీరిన వ్యూహలక్ష్మీ సమేత శ్రీనివాసుడి ఆలయంలో ధనుర్మాసోత్సవాలకు ఏర్పాట్లు చేశారు. పట్టణంలోని వీరాద్రి పర్వతంపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది.


వీరాద్రి పర్వతంపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి


ధర్మవరంలో సిద్ధమైన ఉమావేంకటేశ్వర స్వామి

ఈ నేపథ్యంలో ఆలయ కమిటీ ఆదివారం సాయంత్రం ఆలయంలో సమావేశమై భక్తులకు అసౌకర్యం కలగకుండా చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. పలు ఆలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు.

ఎంతో శుభప్రదం



విష్ణుమూర్తికి ప్రీతికరమైన ధనుర్మాసం ఎంతో శుభప్రదమైనది. అన్ని విష్ణు, వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో నెలరోజుల పాటు తిరుప్పావై పాశురాలను పఠిస్తారు. భక్తురాలైన గోదాదేవి రంగనాథుడిని స్తుతిస్తూ రోజుకో పాశురాన్ని 30 రోజుల పాటు గానం చేశారు. ఆమె స్వామిలో ఐక్యమవడంతో 30వ రోజున గోదాదేవి, శ్రీరంగనాథుల కల్యాణం నిర్వహిస్తారు. పెళ్లికాని యువతులు ఇంటి ముందు, ముగ్గులు, గొబ్బిళ్లతో పూజలు చేస్తే కోరుకున్న వరుడు దొరుకుతాడని ప్రతీతి. భక్తులంతా ధనుర్మాస వ్రతాలు ఆచరిస్తే మంచి జరుగుతుంది.

– ఎరసూరి సీతారామ సుబ్రహ్మణ్యం, ప్రధాన అర్చకుడు, వీరాద్రి వేంకటేశ్వరస్వామి ఆలయం, యలమంచిలి

ధనుర్మాస ఏర్పాట్లు షురూ..


పంచలోహ విగ్రహాలకు మెరుగు దిద్దుతున్న అర్చకుడు

చోడవరం: వైష్ణవాలయాలన్నీ ధనుర్మాసం పూజలకు ముస్తాబయ్యాయి. ఆలయ ప్రాంగణాలన్నీ శుభ్రం చేసి సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. సోమవారం తెల్లవారుజామున నెలగంట మోగడంతో ధనుర్మాస పూజలు ఆలయాల్లో ప్రారంభం కానున్నాయి. అతి ప్రాచీన దేవాలయాల్లో 800 ఏళ్ల నాటి చరిత్ర ఉన్న వైష్ణవాలయాలు చోడవరం పరిసరాల్లో ఉన్నాయి. ప్రసిద్ధిగాంచిన చోడవరం శ్రీకేశవస్వామి దేవాలయం, వడ్డాది వేంకటేశ్వరస్వామి ఆలయంతోపాటు చోడవరం, గోవాడ వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అన్ని ఆలయాల్లో ఉత్సవ మూర్తులకు మెరుగులు దిద్దారు. మూలవిరాట్ విగ్రహాలను శుభ్రం చేశారు. ఆలయాలకు పెయింటింగ్‌లు వేసి, మామిడి తోరణాలతో ముస్తాబు చేశారు. తిరువీధి రథాలు, పల్లకీలు సిద్ధం చేశారు. అత్యంత పవిత్రంగా, పుణ్య మాసంగా భక్తులు భావించే ఈ ధనుర్మాసం ఉత్సవాలకు ఆయా ఆలయ ఉత్సవ కమిటీలు ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి.

గృహాలు మంజూరు చేయాలని వినతి

పాడేరు : పీఎం జన్‌మన్ పథకం ద్వారా పక్కా ఇళ్ల మంజూరుకు చర్యలు తీసుకోవాలని మండలంలోని సలుగు పంచాయతీ డల్లాపల్లి ఆదివాసీలు పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజును కలిసి విన్నవించారు. మండలంలోని డల్లాపల్లి గ్రామాన్ని ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో 40 మంది ఆదివాసీ కుటుంబాలకు పక్కా ఇళ్లు లేవని తమకు కేంద్ర ప్రభుత్వం జన్‌మన్ పథకం ద్వారా ఇళ్లను మంజూరు చేయాలని కోరారు. అక్కడి నుంచి ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు గృహ నిర్మాణ శాఖ అధికారులతో మాట్లాడి సమస్యను వారికి వివరించారు. డల్లాపల్లి ఆదివాసీలకు పక్కా ఇళ్లు మంజూరైందని, సాంకేతిక కారణాలతో ఆలస్యం అవుతోందని అధికారులు ఆయనకు వివరించారు.


డల్లాపల్లిలో గిరిజనులతో మాట్లాడుతున్న పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు

పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఆదివారం సాయంత్రం స్థానిక జిల్లా ఆస్పత్రిని సందర్శించారు. ఆస్పత్రి క్యాజువాలిటీని తనిఖీ చేశారు. వైద్య చికిత్సలు పొందుతున్న రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కూడా సురేష్‌కుమార్ న్నారు.

పేకాట శిబిరంపై దాడి

ఎస్.రాయవరం: పెదగుమ్ములూరు శివారు సీతారాంపురంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై దాడులు చేసి పది మందిని అదుపులోకి తీసుకున్నట్టు ఎస్‌ఐ విభీషణరావు తెలిపారు. ఈ దాడుల్లో రూ.67 వేలు, 7 బైకులు, 10 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, నిందితులను అరెస్టు చేసినట్టు చెప్పారు. పెద ఉప్పలం గ్రామంలో కోడి పందేలు ఆడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్టు ఎస్‌ఐ విభీషణరావు తెలిపారు. వారి నుంచి మూడు కోళ్లు, రూ.600 నగదు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రేపు భీమిలి ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో జాబ్‌మేళా

మురళీనగర్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో భీమిలి ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 17న జాబ్‌మేళా నిర్వహిస్తామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి టి.చాముండేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో మేధా సర్వో డ్రైవ్, క్లోవ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్, అపోలో ఫార్మసీ, ఆస్ట్రా మోటార్స్ కంపెనీలు పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు.

- మేధా సర్వో కంపెనీ ఐటీఐ ఫిట్టర్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రీషియన్, మెషినిస్ట్ పూర్తి చేసిన 25 ఏళ్ల లోపు యువకులకు రూ.15 వేల ఉపకారవేతనంతో అప్రెంటిస్‌షిప్‌కు అవకాశం కల్పిస్తుంది. డిప్లమోలో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ అర్హత ఉన్న వారికి అప్రెంటిస్‌షిప్ కాలంలో నెలకు రూ.16వేల స్టైఫండ్ చెల్లిస్తారు. అప్రెంటిస్‌షిప్ కాకుండా ఇదే కంపెనీలో ఉద్యోగం చేయాలనుకునే డిప్లమో లేదా బీటెక్‌లో ఈసీఈ, ఈఈఈ, ఈఐఐ పూర్తి చేసిన అభ్యర్థులకు నెలకు రూ.26,600 జీతం ఇస్తారు.
- క్లోవ్ టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటెడ్‌లో రివిట్ మోడలర్ ఉద్యోగాలకు బీటెక్ సివిల్, మెకానికల్ పూర్తి చేసిన యువకులు అర్హులు.
- అపోలో ఫార్మసీలో ఫార్మసిస్టు, ఫార్మసీ ట్రైనీ ఉద్యోగాలకు బి-ఫార్మసీ, డి-ఫార్మసీ, ఎం-ఫార్మసీ, ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన యువతీ యువకులు పాల్గొనవచ్చు.
- ఆస్ట్రా మోటార్స్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీ ఉద్యోగాలకు ఏదైనా డిగ్రీ చదివిన యువకులు అర్హులు. ఎంపికైన అభ్యర్థులు విశాఖపట్నం, హైదరాబాద్, కాకినాడలో పనిచేయాల్సి ఉంటుంది. మరిన్ని వివరాలకు 90147 58949 సంప్రదించవచ్చు.

కార్యకర్తలకు అండగా వైఎస్సార్‌సీపీ


వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఉత్తరాంధ్ర రీజినల్ కో- ఆర్డినేటర్ విజయసాయిరెడ్డి, మాజీ మంత్రి అమర్‌నాథ్, అరకు ఎంపీ తనూజారాణి తదితరులు

- సార్వత్రిక, జీవీఎంసీ విజయోత్సవాలు చేసుకున్న కార్యాలయమే మళ్లీ ప్రారంభించుకున్నాం
- విశాఖలోని నూతన కార్యాలయం ప్రారంభోత్సవంలో విజయసాయిరెడ్డి, బొత్స, అమర్‌నాథ్

సాక్షి, విశాఖపట్నం: కార్యకర్తలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా నిలుస్తుందని ఆ పార్టీ ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ వి.విజయసాయిరెడ్డి, శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ భరోసా నిచ్చారు. 2019 సార్వత్రిక ఎన్నికలు, జీవీఎంసీ ఎన్నికల విజయోత్సవాలు చేసుకున్న పార్టీ కార్యాలయాన్నే మళ్లీ ప్రారంభించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఆదివారం మద్దిలపాలెంలోని కృష్ణా కళాశాల సమీపంలో వైఎస్సార్‌సీపీ నూతన కార్యాలయాన్ని మాజీ మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, బూడి ముత్యాలనాయుడులతో కలిసి ప్రారంభించారు. అనంతరం రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్, దివంగత మహానేత వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

ఈ సందర్భంగా విజయ సాయిరెడ్డి మాట్లాడుతూ.. ఉత్తరాంధ్రకు రీజినల్ కోఆర్డినేటర్‌గా మళ్లీ రావడం సంతోషంగా ఉందన్నారు. కార్యకర్తలకు, నాయకులకు గత ఎన్నికల్లో ఓడిపోయామనే ఆందోళన అవసరం లేదన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు పార్టీలకతీతంగా అందరితో కలిసి ముందుకు సాగాలన్నారు. నెల్లూరు లోక్‌సభ సభ్యుడిగా పోటీ చేసి తాను కూడా ఓటమి చెందిన విషయం గుర్తుచేశారు. ఈ నెల 13న రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు మద్దతుగా చేపట్టిన నిరసన కార్యక్రమం విజయవంతమైందన్నారు. ఇదే తరహాలో ప్రజల తరఫున పోరాటం చేయాలన్నారు. గత ఐదేళ్లలో కార్యకర్తలు అసంతృప్తికి గురయ్యారని, భవిష్యత్తులో పునరావృతం కాకుండా ముందుకు సాగాలన్నారు. కౌంటింగ్ ఫలితాలు పరిశీలిస్తే గంటలోనే పరిస్థితి అర్థమైందని, ఈవీఎంలపై అనుమానం ఉందని, చివరి వరకు పోరాటం చేయాలన్నారు. 2027 ఎన్నికల్లో విజయం తథ్యమన్నారు. ఎమ్మెల్సీ బొత్స మాట్లాడుతూ.. పార్టీ చేసే పోరాటాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. ఈ నెల 27న కరెంట్ చార్జీల పెంపుపై నిరసన కార్యక్రమాన్ని కూడా జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం మీడియాను పట్టుకుని హడావుడి చేస్తోందని ఆక్షేపించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తగిన ప్రాధాన్యం దక్కుతుందని హామీ ఇచ్చారు. మాజీ మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ.. పార్టీ జిల్లా కార్యాలయం ఎండాడలో ఉన్నా, కార్యకర్తలకు అందుబాటులో ఉండాలనే నగర పార్టీ కార్యాలయాన్ని కొత్తగా ఏర్పాటు చేశామన్నారు. ఆరు నెలల్లో చంద్రబాబు రూ.72 వేల కోట్లు అప్పు తెచ్చి, సంక్షేమానికి రూ.2 వేల కోట్లు కూడా ఖర్చు చేయలేదన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుల నుంచి పుట్టిన పార్టీ కాదని, కార్యకర్తల నుంచి పుట్టిన పార్టీ అని, వలస నాయకులు తెలుసుకోవాలన్నారు. పార్టీ పదవులు అనుభవించి భీమిలి నుంచి ఒక వలస నాయకుడు రాజీనామా చేస్తే, ఆ నియోజకవర్గం పార్టీ నాయకులతో సమావేశం నిర్వహిస్తే కార్యకర్తలు, నాయకులు అందరూ హాజరయ్యారన్నారు. నాయకుడు పోతే కార్యకర్త వెళ్లడనే విషయం తెలుసుకోవాలన్నారు. వైఎస్ఆర్సీపీ ప్రభుత్వంలో ప్రజలు నష్టపోలేదు.. కేవలం కార్యకర్తలే నష్టపోయారు.

జమిలి ఎన్నికలు ఎప్పుడు వచ్చినా పార్టీ గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలన్నారు. మాజీ మంత్రి ముత్యాలనాయుడు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో పార్టీ విజయానికి కార్యకర్తలంతా సమష్టి కృషితో పని చేయాలని పిలుపునిచ్చారు. అరకు ఎంపీ తనూజారాణి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌ను అన్ని విధాలా అభివృద్ధి వైపు నడిపించాలంటే జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించుకోవాలన్నారు. మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, ఎమ్మెల్సీలు వరుదు కళ్యాణి, కుంభా రవిబాబు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లా స్థాయి ఎద్దుల పరుగు పోటీలు

బుచ్చెయ్యపేట: మండలంలోని నీలకంఠాపురం గ్రామంలో సోమవారం జిల్లా స్థాయి ఎద్దుల పరుగు పోటీలు జరగనున్నాయి. గ్రామంలోని భక్త వీరంజనేయ స్వామి ఆలయ 11వ వార్షికోత్సవం సందర్భంగా ఈ పోటీలు చేసినట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన విజతలకు వరుసగా రూ.10వేలు, రూ.8వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు అందజేస్తామన్నారు.

21 నుంచి ఉభయరాష్ట్రాల ఆహ్వాన నాటకోత్సవాలు

అనకాపల్లి: పట్టణం నాటికలకు పుట్టినిల్లు అని జార్జి క్లబ్ అధ్యక్షుడు బి.ఎస్.ఎం.కె. జోగినాయుడు తెలిపారు. స్థానిక జార్జి క్లబ్ ఆవరణలో ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటకోత్సవాల కరపత్రాలను ఆదివారం కమిటీ సభ్యులు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నాటకోత్సవాలను ఈ నెల 21, 22, 23 తేదీల్లో క్లబ్ కార్యాలయంలో హైదరాబాద్‌కు చెందిన తెలుగు డ్రామా, జార్జిక్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 21వ తేదీ సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్ మహతి క్రియేషన్స్ వారి 'ఉక్కు సంకెళ్లు', రాత్రి 8 గంటలకు విశాఖ, ఉక్కునగరం చైతన్య కళా స్రవంతి వారి '(అ) సత్యం', 22వ తేదీ సాయంత్రం 6 గంటలకు గుంటూరు జిల్లా తాడేపల్లి అరవింద్ ఆర్ట్స్ వారి 'విడాకులు కావాలి', రాత్రి 8 గంటలకు బాపట్ల జిల్లా వారి 'వర్క్ ఫ్రమ్ హోమ్', 23వ తేదీ సాయంత్రం 6 గంటలకు అనకాపల్లి షిర్డీ సాయి కుల్వంత్ వెల్ఫేర్ అసోసియేషన్ వారి 'వేదాంతం', రాత్రి 8 గంటలకు ఉత్తరాంధ్ర వారి సౌజన్య కళా స్రవంతి వారి 'దేవరాగం' అనే నాటకాలను ప్రదర్శించనున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి బుద్ధ కాశీ విశ్వేశ్వరరావు, కోశాధికారి విల్లూరి చంద్రశేఖర్, నాటకోత్సవాల కన్వీనర్ కె.ఎం.నాయుడు తదితరులు పాల్గొన్నారు.


నాటకోత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జార్జి క్లబ్ కమిటీ సభ్యులు

మన్యంలో విజృంభిస్తున్న చలి

- సాయంత్రం 4 నుంచి చల్లగాలులు
- ఉదయం 9గంటలైనా వీడనిమంచు తెరలు
- వాహనచోదకుల అవస్థలు


డుంబ్రిగుడలో చలిమంట వద్ద సేదతీరుతున్న గిరిజనులు

డుంబ్రిగుడ: మండలంలోని చలి ఉష్ణోగ్రతలు రోజురోజుకు తగ్గిపోతున్నాయి. చలి తీవ్రత అధికమవుతుండటంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 3 నుంచి 6 గంటల సమయంలో 8, 9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నట్టు అధికారులు చెబుతున్నారు. సాయంత్రం 4 నుంచి చలి మొదలవుతుంది. చలిమంటలు వేసుకుంటూ సేద తీరుతున్నారు. ఆదివారం ఉదయం 10 గంటలవుతున్నా చలిమంచు వీడలేదు.

హుకుంపేట: మండలంలో గిరిజనులకు చలి వణికిస్తోంది. గడిచిన మూడు రోజులుగా చలి తీవ్రత ఎక్కువగా ఉండడం వలన గిరిజన రైతులు, కూలీలు, విద్యార్థులు బయటకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 11గంటల వరకు మంచి తెరలు వీడకపోవడంతో చలిమంటలనే గిరిజనులు ఆశ్రయిస్తున్నారు.

సీలేరు: సీలేరులో ఆదివారం చలి గజగజలాడించింది.వాతావరణంలో మార్పులు చోటుచేసుకొని మంచు తీవ్రత అధికం కావడంతో ఆదివారం ఉదయం 9గంటల వరకు మంచు తెరలు వీడలేదు. సీలేరు మార్కెట్, జెన్‌కో కాలనీ, గుంటవాడ డ్యామ్ వంటి పర్యాటక ప్రాంతాల్లో అధిక మోతాదులో మంచు కురిసింది. రోడ్లపై దట్టంగా మంచు పడడంతో వాహనాలు సైతం పగలు కూడా లైట్లు వేసుకొని ప్రయాణం సాగించారు. పర్యాటకులు ఈ సీజన్‌ను ఆస్వాదిస్తూ పర్యాటక ప్రాంతాల్లో సందడి చేస్తున్నారు.


మంచు తెరలో దిగుడుపుట్టు వంతెన


గుంటవాడ డ్యామ్ వద్ద కురుస్తున్న మంచు

అయ్యో దేవుడా.. మాకెందుకీ శిక్ష

- మార్చురీ వద్ద మిన్నంటిన రోదనలు
- రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

యలమంచిలి రూరల్: 'బాగా చదివి మంచి ఉద్యోగం చేసి మమ్మల్ని చూస్తానన్నావు.. స్నేహితులతో సరదాగా సినిమా చూసొస్తానని వెళ్లి మాకు పుత్రశోకాన్ని మిగిల్చావు.. అయ్యో దేవుడా మేమేం పాపం చేశామని, మాకింత పెద్ద శిక్ష విధించావు.. ప్రసాదూ లేవరా.. 13 ఏళ్లకే నూరేళ్లు నిండిపోయాయి'.. అంటూ రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాందిన రేవుపోలవరానికి చెందిన విద్యార్థి దుర్గాప్రసాద్ మృతదేహంపై పడి తల్లిదండ్రులు, తమ్ముడు గుండెలవిసేలా రోదించారు. ఆదివారం యలమంచిలి మార్చురీ వద్ద ఈ దృశ్యం చూపరులను కంటతడి పెట్టించింది. మృతుని స్వగ్రామం రేవుపోలవరంలో విషాద ఛాయలు అలముకున్నాయి. మండలంలో లైనుకొత్తూరు వద్ద శనివారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంపై కేసు నమోదు చేసినట్టు యలమంచిలి రూరల్ ఎస్సై ఎం ఉపేంద్ర తెలిపారు. ఎస్. రాయవరం మండలం రేవుపోలవరం గ్రామానికి చెందిన దారబోయిన గోవిందరావు పెద్ద కుమారుడు దుర్గాప్రసాద్(13), అదే గ్రామానికి చెందిన అర్జిల్లి ప్రవీణ్(14) శనివారం మధ్యాహ్నం యలమంచిలిలో సినిమా చూసేందుకు ద్విచక్ర వాహనంపై వచ్చారు. సినిమా చూసిన తర్వాత తమ గ్రామానికి తిరిగి వెళ్తున్నారు. ఈ క్రమంలో యలమంచిలి మండలం లైనుకొత్తూరు వద్ద రోడ్డు దాటుతున్న మరో ద్విచక్ర వాహనాన్ని విద్యార్థులు నడుపుతున్న బైకు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన దుర్గాప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందాడు. మరో విద్యార్థి ప్రవీణ్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ప్రమాదంపై మృతి చెందిన విద్యార్థి తండ్రి గోవిందరావు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎటువంటి సిగ్నల్ ఇవ్వకుండా నిర్లక్ష్యంగా ద్విచక్ర వాహనాన్ని నడపుతూ రోడ్డు దాటడం వల్లే ప్రమాదం జరిగి, తన కుమారుడు మృతి చెందాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

కుటుంబీకులకు విద్యార్థి మృతదేహం అప్పగింత

యలమంచిలి మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం విద్యార్థి దుర్గాప్రసాద్ మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు. సినిమా చూసొస్తానని వెళ్లిన కుమారుడు అనూహ్యంగా జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందడంతో విద్యార్థి తల్లిదండ్రులు, కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మార్చురీ వద్ద వారి రోదనలు మిన్నంటడం చూపరులను సైతం కంటతడి పెట్టించింది. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని పోలీసులు, రవాణా శాఖాధికారులు ఎంత అవగాహన కల్పిస్తున్నా కొందరు తల్లిదండ్రులు ఆ హెచ్చరికలను విస్మరిస్తుండడంతో అనుకోని ప్రమాదాలతో తీరని విషాదం మిగులుతుంది. మైనార్టీ తీరని పిల్లలకు వాహనాలు ఇస్తే, వారు ప్రమాదాల బారిన పడి ప్రాణాల మీదకు తెచ్చుకోవడంతోపాటు, ఎదుటి వారిని కూడా ప్రమాదాలకు గురి చేస్తున్నారని పోలీసులు చెబుతున్నారు. మైనర్లకు వాహనాలిచ్చే విషయంలో తల్లిదండ్రులు అత్యంత బాధ్యతగా వ్యవహరించాలని సూచిస్తున్నారు